## విద్యార్థులు కళాశాలకు పేరుతేవాలి

**జిల్లా క్రీడల అధికారి పరంధామరెడ్డి**

మాట్లాడుతున్న జిల్లా క్రీడల అధికారి పరంధామరెడ్డి

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 8 : విద్యార్థులు చదువుతో పాటు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రతిభ చూపి కళాశాలకు మంచి పేరు తేవాలని జిల్లా యువజన క్రీడల అధికారి పరంధామరెడ్డి అన్నారు. మంగళవారం పాల్వంచ మండలంలోని లక్ష్మీదేవిపల్లి(ఎస్) ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారానికొకసారి కళాశాలలో సాహిత్య, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పాల్వంచ మండలంలోని లక్ష్మీదేవిపల్లి సోషల్ వెల్ఫేర్ స్కూల్, కాలేజీలో మంగళవారం వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా ఎంఈవో శ్రీరామ్మూర్తి, ప్రిన్సిపాల్ పాపారావు పాల్గొన్నారు.

## కర్రెగుట్టపైకి వేటకు రావొద్దు..

**లేఖ విడుదల చేసిన మావోయిస్టు పార్టీ**

చర్ల, ఏప్రిల్ 8 : 'ఆపరేషన్ కగార్' దాడి నుంచి రక్షణ పొందేందుకు కర్రెగుట్టపై బాంబులు అమర్చామని, అయినా కొందరు పోలీసుల మాటలు నమ్మి, డబ్బుకు ఆశపడి ఇన్‌ఫార్మర్లుగా మారి షికారు పేరుతో వస్తున్నారని, అలాంటి వారెవరూ గుట్టపైకి రావొద్దని మావోయిస్టు పార్టీ వాజేడు–వెంకటాపురం ఏరియా కార్యదర్శి శాంత మంగళవారం విడుదల చేసిన లేఖలో పేర్కొన్నారు. తమ రక్షణ కోసం అమర్చిన బాంబుల వల్ల ఇతరులు గాయపడుతున్నారని, పోలీసుల మాటలు నమ్మి ఎవరూ ఇటువైపు రావొద్దని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా ఇప్పటివరకు ఆరు గ్యారెంటీలు అమలు చేయలేదని, ప్రజలు తమ సమస్యలపై అనేక దరఖాస్తులు చేసుకున్నప్పటికి ఒక్కటి కూడా పరిష్కారం కాలేదని లేఖలో పేర్కొన్నారు. అపరిష్కృత సమస్యలపై ప్రజలు, ప్రజా సంఘాలు పోరాడుతుంటే వారిపై పోలీసుల లాఠీచార్జి చేసి అరెస్టులు చేస్తూ జైళ్లలో పెట్టి వేస్తున్నారని, ఇది సమంజసం కాదని శాంత పేర్కొన్నారు.

## విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న దృశ్యం

మణుగూరు టౌన్, ఏప్రిల్ 8: మణుగూరు మండలం గుట్టమల్లారంలోని శ్రీచైతన్య పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి హర్షిత్ ఐఐస్‌టీఎస్‌వో మ్యాథ్స్ విభాగంలో జాతీయ స్థాయిలో అత్యున్నతమైన ప్రతిభ కనబర్చి గ్రాండ్ లెవెల్ ప్రైజ్ గెలుపొందినట్లు ప్రిన్సిపాల్ యుగంధర్ మంగళవారం తెలిపారు. మణుగూరు ఎంఈవో స్వర్ణలత చేతుల మీదుగా విద్యార్థికి లాప్‌ట్యాప్ అందజేశారు.

## నేడు మున్నూరు కాపు సభ సన్నాహక సమావేశం

మణుగూరు టౌన్, ఏప్రిల్ 8: వచ్చే నెలలో హైదరాబాద్‌లో జరిగే మున్నూరుకాపు సింహగర్జన సభ విజయవంతం కోసం బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు మంగళవారం తెలిపారు. జిల్లాలోని మున్నూరు కాపు కమిటీ సభ్యులు మణుగూరు మున్నూరు కాపు సంఘం కార్యాలయంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు జరిగే సమావేశంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## 'యువ విజ్ఞాని'కి గురుకుల విద్యార్థి ఎంపిక

దమ్మపేటరూరల్, ఏప్రిల్ 8 : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ 'యువ విజ్ఞాని' కార్యక్రమానికి సాంఘిక సంక్షేమ గురుకులంలో 9వ తరగతి చదువుతున్న ఉదయ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షలో తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికైన 10మందిలో ఉదయ్ ఒకరు. దేశంలో ఉన్న 5 పరిశోధన కేంద్రాల్లో ఎంపికచేసిన కేంద్రంలో మే 18 నుంచి 30వ తేదీ వరకు శిక్షణనిస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు.

## నకిలీ మందులను విక్రయిస్తే కఠిన చర్యలు

అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 8 : నకిలీ విత్తనాలు, మందులను విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని ఏపో అనూష హెచ్చరించారు. మంగళవారం అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని ఎరువులు, విత్తన దుకాణాలను ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుకాణాదారులు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లను త్వరగా నిర్మించుకోవాలి

శంకుస్థాపనలో కలెక్టర్, ఎమ్మెల్యే కనకయ్య, పీవో రాహుల్

టేకులపల్లి/ ఇల్లెందు/ కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 8 : ఇందిరమ్మ ఇండ్ల విషయంలో లబ్ధిదారులు ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక తోడ్పాటుకు వారి స్తోమత మేరకు ఇండ్లు వెంటనే నిర్మించుకోవాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య, కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. మంగళవారం టేకులపల్లి మండలం కోయగూడెం గ్రామంలో హౌసింగ్ పీడీ శంకర్ ఆధ్వర్యంలో 303 ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం లచ్చగూడెంలో సన్నబియ్యం లబ్ధిదారి ఇంటి వద్ద అధికారులు భోజనం చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో రాహుల్, ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీవో రవీందర్‌రావు, ఎంపీవో గణేష్ గాంధీ పాల్గొన్నారు.

**కలెక్టర్‌కు వినతి**

కోయగూడెం ఉపరితల గని–2లో ఫిట్–2, 3 భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించు విషయంలో హైకోర్టు తీర్పును అమలు చేయాలని కలెక్టర్‌కు భూనిర్వాసితుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ వినతిపత్రం ఇచ్చారు.

**ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్**

కొత్తగూడెంలోని ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తనిఖీ చేశారు. సాధారణ తనిఖీలో భాగంగా ఈవీఎం, వీవీ ప్యాట్‌లు ఉన్న గదిని సీసీ కెమెరా గదిలో కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఆయన వెంట ఎన్నికల సూపరింటెండెంట్ దారా ప్రసాద్, ఎలక్షన్ సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**జిల్లాలో ఆహారభద్రత పెంపు కోసం చర్యలు**

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఆహారభద్రత పెంపు కోసం చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లాస్థాయి అడ్వైజరీ కమిటీ మీటింగ్ ఫుడ్ సేఫ్టీపై నిర్వహించారు. కలెక్షన్ పాయింట్ల ద్వారా వాడిన వంటనూనెను సేకరించి బయో గ్యాస్ కోసం ఉపయోగించాలని, ఫుడ్ పాయిజనింగ్ జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్యసేవలు గురించి వివరించారు. చిన్న, మధ్యతరహా ఆహార వ్యాపారులకు వర్తించే ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఎంహెచ్‌వో భాస్కర్, డీఎస్పీ రెహమాన్, హోటల్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ బోర్డులో అవినీతి జరగకుండా చూస్తా

**సింగరేణి ప్రధానాసుపత్రి సీఎంవో డా.కిరణ్ రాజ్‌కుమార్**

కొత్తగూడెం సింగరేణి, ఏప్రిల్ 8: సింగరేణి మెడికల్ బోర్డుపై ఏర్పడ్డ అవినీతి మచ్చను తుడిచివేస్తానని సింగరేణి ప్రధానాసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎంవో)గా నూతనంగా నియమితులైన డాక్టర్ కిరణ్ రాజ్‌కుమార్ అన్నారు. కారుణ్య నియామకాల్లో భాగంగా ప్రతి నెలా జరిగే మెడికల్ బోర్డులో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని వస్తున్న ఆరోపణలపై దృష్టి సారిస్తామని, పారదర్శకతను పాటిస్తూ భవిష్యత్తులో ఆరోపణలు రాకుండా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. మెడికల్ బోర్డుపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో 'నమస్తే తెలంగాణ'తో మంగళవారం ఆయన మాట్లాడారు. బోర్డు మెడికల్‌లో దళారులను నమ్మి కార్మికులు ఆర్థికంగా మోసపోతున్నారని వస్తున్న ఆరోపణలు నివారించి ఎంతటి వారిపైనైనా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సింగరేణి ఆస్పత్రుల్లో పంపిణీ చేసే మందులపై అనేక అపోహలు ఉన్నాయని అన్నారు. అయితే, కార్మికులు, వారి కుటుంబీకులు ఆ అపోహల పట్ల ఆందోళన చెందవద్దని సూచించారు. నాణ్యతా ప్రమాణాలున్న మందులనే పంపిణీ చేస్తున్నామని అన్నారు.

## నేడు బీఆర్ఎస్ సమావేశం

టేకులపల్లి, ఏప్రిల్ 8 : టేకులపల్లి మండల కేంద్రంలో ఈ నెల 9వ తేదీ బుధవారం జరిగే మండల స్థాయి బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ రజతోత్సవ నేపథ్యంలో జరిగే ఈ సమావేశానికి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

## అకాల వర్షం.. పంట నష్టం

నేలవాలిన మొక్కజొన్నను చూపుతున్న రైతు

గుండాల, ఏప్రిల్ 8: గుండాల మండలంలో సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి పంట నష్టం జరిగింది. గాలీవాన బీభత్సం సృష్టించడంతో రైతులు వేసిన యాసంగి మొక్కజొన్న పంట నేలకొరిగింది. అంతేకాకుండా విద్యుత్ స్థంబాలు విరిగిపడి రాత్రంతా విద్యుత్ అంతరాయంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

## సన్నబియ్యం పంపిణీ సక్రమంగా జరగాలి

దుమ్ముగూడెం, ఏప్రిల్ 8: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ పథకాన్ని సక్రమంగా జరిగేలా చూడాలని పంచాయతీ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ మామిడి అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సింగవరం, నిమ్మలగూడెం, లక్ష్మీపురం, వైట్‌నాగారం గ్రామాలను ఆయన సందర్శించారు. రేషన్ దుకాణంలో రికార్డులను పరిశీలించి సన్నబియ్యం పంపిణీ జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. గిర్దావర్ కల్లూరి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు కార్తీక్, స్వాతి, డీలర్లు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

బూర్గంపహాడ్, ఏప్రిల్ 8: ఉపాధి పని ప్రదేశంలో కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని ముసలిమడుగు పంచాయతీ రామాపురంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి..

**టీజీ జెన్కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా**

అధికారులతో మాట్లాడుతున్న సీఎండీ

మణుగూరు టౌన్, ఏప్రిల్ 8 : బీటీపీఎస్ ఉన్న చిక్కుడుగుంట గ్రామంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జెన్కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా గ్రామస్తులకు హామీ ఇచ్చారు. మణుగూరు బీటీపీఎస్‌ను మంగళవారం సందర్శించిన ఆయనకు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య, పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీసీ కామిరెడ్డి రామారావు, నాయకులు పులిగల రమేశ్, మేడా వెంకటేశ్వరరావు, రైతులు పలు సమస్యలను వివరించారు. దీనికి ఆయన స్పందిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**బీటీపీఎస్ రైల్వే ట్రాక్ నిర్మాణంపై సమీక్ష**

పాల్వంచ, ఏప్రిల్ 8 : మణుగూరులోని బీటీపీఎస్‌కు సింగరేణి నుంచి వచ్చే రైలు మార్గానికి సంబంధించి భూ సమస్యలపై పాల్వంచలోని కేటీపీఎస్ అతిథి గృహంలో టీజీ జెన్కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌తో మంగళవారం సమీక్షించారు. తొలుత ప్లాంట్‌ను సందర్శించిన సీఎండీ అనంతరం సీకాలనీలోని టీజీ జెన్కో శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. కేటీపీఎస్, జెన్కో అధికారులతో సమీక్షించారు. ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ పనితీరు, శిక్షణలో ఉన్న ఇంజినీర్లతో ఆయన మాట్లాడారు. శిక్షణకు వచ్చే వారికి వసతి సౌకర్యం కల్పించడంపై చర్చించారు.

## వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం

పినపాక, ఏప్రిల్ 8: మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన బట్ట రవి కుమారుడు దీపక్ తలలో నీరు చేరి తీవ్ర అనారోగ్యం పాలయ్యాడు. ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య చికిత్సలు చేయించినప్పటికి తగ్గలేదు. ఆపరేషన్ చేస్తే తప్ప వ్యాధి నయం కాదు అని డాక్టర్లు తేల్చి చెప్పారు. రవిది నిరుపేద కుటుంబం కావడంతో తన కుమారుడి ఆపరేషన్ కోసం దాతల సహాయం కోసం వేడుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న 'జనం కోసం మనం' అనే స్వచ్ఛంద సంస్థ వారు రవి కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు.

## కొత్త కమిటీని ఎన్నుకోవాలి

**చిన్నరాయిగూడెం ఇసుక కమిటీ సభ్యులు**

మణుగూరు టౌన్, ఏప్రిల్ 8: మండలంలోని చిన్నరాయిగూడెం సమ్మక్క సారక్క పాత కమిటీని వెంటనే రద్దు చేసి కొత్త కమిటీని ఎన్నుకోవాలని కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. మణుగూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంట్రాక్టర్ గంట్ల రమేష్‌పై సదరు పాత కమిటీ సభ్యులు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని, ఇందులో ఎలాంటి వాస్తవాలు లేవన్నారు. పాత కమిటీలో తమకు ఎలాంటి గౌరవం, ఎలాంటి ఆదరణ లేదని, తమకు పనులు కూడా చూపించడం లేదని, అందుకే తామంతా కొత్త కమిటీగా ఏర్పాటు అయ్యామని అన్నారు.

## శ్రీరామనవమికి ఆర్టీసీ ఆదాయం రూ.92.61లక్షలు

భద్రాచలం, ఏప్రిల్ 8: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి, మహా పట్టాభిషేకం సందర్భంగా భద్రాచలం ఆర్టీసీ డిపో నుంచి 5 నుంచి 7వ తేదీ వరకు 78 రూట్లలో ప్రత్యేక బస్సులు నడపగా రూ.92.61 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆర్టీసీ డీఎం తిరుపతి మంగళవారం తెలిపారు. గత ఏడాది కంటే రూ.16.76 లక్షలు అదనంగా ఆదాయం వచ్చినట్లు డీఎం తెలిపారు. శ్రీరామనవమి, మహా పట్టాభిషేకం సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులతో మజ్జిగ, పానకం, ఆర్టీసీ ఉద్యోగులకు మధ్యాహ్న భోజనం తదితర సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు.

## చర్ల బస్టాండులో ఆర్‌వో ప్లాంట్ ప్రారంభం

చర్ల, ఏప్రిల్ 8: చర్ల ఆర్టీసీ బస్టాండ్‌లో దాతల సహకారంతో ఆర్‌వో ప్లాంట్‌ను సీఐ రాజువర్మ, భద్రాచలం డిపో మేనేజర్ తిరుపతిరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్సా శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ తిరుపతిరావు, సీఐ రాజువర్మ మాట్లాడుతూ.. ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటుకు ఆర్థిక సహాయాన్ని అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గీద కోదండరామయ్య, నల్లపు దుర్గాప్రసాదరావు, నర్సిరెడ్డి, కేశవ్, పోలిన రామచంద్రరావు, దొడ్డి నాగవర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 'కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లోపించింది'

ఇల్లెందురూరల్, ఏప్రిల్ 8 : ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లోపించిందని సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు తాళ్ళూరి కృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సుభాష్‌నగర్ గ్రామ పంచాయతీ బుడిగజంగాల కాలనీలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇంటింటి సర్వేలో వచ్చిన సమస్యలపై భవిష్యత్తులో ప్రజా సమీకరణ నిర్వహించి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మన్నెం మోహన్‌రావు, మాదారపు వెంకటేశ్వర్లు, వజ్జ సురేష్, సుబ్బారావు, శ్రీశైలం, రమేష్, కళ్యాణ్, గోపి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## సభను అడ్డుకునేందుకే సిటీ పోలీస్‌యాక్ట్

జూలూరుపాడు, ఏప్రిల్ 8 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఈ నెల 27వ తేదీన జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను అడ్డుకునేందుకే ప్రభుత్వం నెల రోజుల పాటు సిటీ పోలీస్ యాక్ట్‌ను అమలు చేస్తున్నదని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు లాకావత్ గిరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. పోలీస్ యాక్ట్‌ను రద్దు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు.

## రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

జూలూరుపాడు, ఏప్రిల్ 8 : మండల పరిధిలోని వినోభానగర్ గ్రామంలో ఇటీవల మేల్ ఫిమేల్ మొక్కజొన్న కంకులు తిని మృతిచెందిన జర్పుల కృష్ణ కుటుంబానికి రూ.25 లక్షలు చెల్లించి ఆదుకోవాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రైతు కుటుంబాన్ని ఆ సంఘం నాయకులతో కలిసి పరామర్శించారు.

## నేటి ధర్నాను జయప్రదం చేయండి

జూలూరుపాడు, ఏప్రిల్ 8 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతువ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యాసా రోశయ్య కోరారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫార్సులను తక్షణమే అమలు చేయాలని, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని కోరారు.

## గ్యాస్ ధరలు తగ్గించాలి

కట్టెల పొయ్యి పెట్టి నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 8 : కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని పీవోడబ్ల్యూటీయూసీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కేంద్రం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా చంద్ర అరుణ, కల్పన మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం మరోసారి దేశ ప్రజలపై పెనుభారాన్ని మోపిందని వారు మండిపడ్డారు.

**'ధరలు పెంచితే బుద్ధి చెపుతాం..'**

పాల్వంచ, మార్చి 8 : అధికారం చేపట్టినప్పటి నుంచి ధరలు అమాంతం పెంచుకుంటూ పోతున్న కేంద్రానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని, పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం అన్నారు. మోదీ ఇప్పటివరకు గ్యాస్ ధరలు పెంచి మహిళను కట్టెలపొయ్యి వైపు వెళ్లే విధంగా చేస్తున్నాడని ఎద్దేవా చేశారు.

భద్రాచలం, ఏప్రిల్ 8: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు డి.సీతాలక్ష్మి, జిల్లా సీనియర్ నాయకులు నాదెళ్ల లీలావతి సమక్షంలో ఐద్వా నాయకురాళ్లు ఖాళీ గ్యాస్‌బండ ఒకవైపు మరోవైపు కట్టెల పొయ్యి పెట్టి కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసించారు.

## వేటగాని ఉచ్చుకు ఆవు మృతి

అశ్వాపురం, ఏప్రిల్ 8: మండల పరిధిలోని రామచంద్రాపురం పల్లెప్రకృతి వనం సమీపంలో వేటగాని ఉచ్చులో పడి ఆవు మృతిచెందింది. పల్లెప్రకృతి వనం సమీపంలో అడవి జంతువులను వేటాడేందుకు పెట్టిన ఉచ్చులో పడి చింతకుంట గ్రామానికి చెందిన సోడె లక్ష్మయ్యకు చెందిన ఆవు మృతిచెందింది. 20 రోజుల లేగదూడ పాలు తాగేందుకు ప్రయత్నించడం చూసి కంటతడి పలువురిని పెట్టించింది.

## కొత్త టెండర్లు వేయాలి

పాల్వంచ, మార్చి 8 : కేటీపీఎస్‌కు సంబంధించిన బూడిద తరలింపునకు ఈ ఆర్థిక సంవత్సరం నూతన టెండర్లను పిలిచి అర్హులైన 39మందికి వర్క్ ఆర్డర్ ఇవ్వాలని బాధిత గ్రామాల సభ్యుడు ధర్మసోతు చందర్ డిమాండ్ చేశారు. మంగళవారం పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ గత ఏడాది అక్రమంగా టెండర్లు పొందిన ముగ్గురు కాంట్రాక్టర్లు మాత్రమే దాన్ని ఆక్రమించి తరలిస్తున్నారని అన్నారు. ఈ సారి తమకు అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో బట్టు అశోక్, కృష్ణ, బోడా బీమా పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 8 : కొత్తగూడెంలోని న్యాక్ శిక్షణ కేంద్రంలో ఒక నెల టైలరింగ్ కోర్సు కోసం ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని నాక్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరాజు మంగళవారం ప్రకటనలో తెలిపారు. బ్లౌజ్ డిజైన్, పంజాబీ డ్రెస్, ఫ్రాక్స్, నిక్కర్, షర్టు, మోడల్స్ బ్లౌజులు కుట్టేందుకు శిక్షణ ఉంటుందని చెప్పారు. కోర్సు ఫీజు రూ.2 వేలు ఉంటుందని, ఆధార్‌కార్డు, ఫొటోలతో 9292650982 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ములకలపల్లి, ఏప్రిల్ 8 : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమై సుమారు రెండు లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లిన ఘటన రామచంద్రాపురం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బాల్దా అరుణమ్మ ఇంటికి మంగళవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. ఆ సమయంలో ఈదురుగాలులు వీస్తుండటంతో ఇల్లు, ఇంట్లోని సామాన్లు అన్ని పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది.

## బియ్యం లారీ పట్టివేత

ములకలపల్లి, ఏప్రిల్ 8 : అనుమతి పత్రాలు లేకుండా ఆంధ్రా నుంచి ఛత్తీస్‌గఢ్‌కు తరలిస్తున్న బియ్యం లారీని టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. ఆంధ్రప్రదేశ్‌లోని తిరువూరు, విస్సన్నపేటల నుంచి సుమారు 350 క్వింటాళ్ల బియ్యం లోడ్‌తో లారీ ఛత్తీస్‌గఢ్ వైపు వెళ్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్సై ప్రవీణ్, ములకలపల్లి మండలం జగన్నాధపురం వద్ద లారీని అదుపులోకి తీసుకొని ములకలపల్లి ఎస్సై రాజశేఖర్‌కు అప్పగించారు. బియ్యం షాంపిల్స్‌ను సివిల్ సప్లై అధికారులకు పంపినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

## కేసు నమోదు

టేకులపల్లి, ఏప్రిల్ 8 : నాలుగురోజుల క్రితం మోటర్ సైకిల్ మిస్సింగ్ అయిన ఘటన ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డులో చోటుచేసుకుంది. టేకులపల్లి ఎస్సై పి.సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 4వ తేదీన సాయంత్రం పాల్వంచ పట్టణానికి చెందిన గంగపురి దుర్గాప్రసాద్ తన మోటర్ సైకిల్‌ని ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డులో ఓ ఇంటివద్ద పెట్టి డోర్ కల్‌లోని బంధువుల ఇంటికి వెళ్లి మరుసటిరోజు వచ్చి చూసుకునే సరికి మోటర్ సైకిల్ కనిపించలేదు. దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు

ఇల్లెందు, ఏప్రిల్ 8 : అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఇల్లెందు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకున్న నిరుపేదలకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ బానోత్ రాంబాబు, యదలపల్లి అనసూయ, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, రాము పాల్గొన్నారు.

## శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

మణుగూరు టౌన్, ఏప్రిల్ 8: సింగరేణి సీఎండీ బలరాం ప్రత్యేక చొరవతో కోల్‌బెల్టు ఏరియాల్లో ఉచిత పాలీసెట్ శిక్షణ తరగతుల నిర్వహణకు నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. సింగరేణి కార్మికుల పిల్లలను ఉన్నత స్థాయిలో ఉంచే లక్ష్యంతో యాజమాన